ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు



రామంతాపూర్: జీహెచ్‌ఎంసీ, టీఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో ఉప్పల్ సర్కిల్‌లోని మూడు ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ వెహికిల్ (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. రామంతాపూర్ ప్రధాన రహదారిలోని గోకుల్‌నగర్ బస్టాండ్, ఎస్వీ గ్రాండ్ హోటల్ ఎదురుగా సెమినరీ చర్చి వద్ద, హబ్సిగూడ మెట్రో పిల్లర్ నెంబర్ 929 ఎదురుగా చార్జింగ్ స్టేషన్‌లో అందుబాటులోకి వచ్చాయి.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

గౌతంనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భాష్యం స్కూల్స్ జెడ్‌ఈవో మార్కండేయులు సూచించారు. శుక్రవారం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు జోనల్ లెవెల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి రంజీ ట్రోఫీ కోచ్ రొనార్డ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచీల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బండబావిని అభివృద్ధి చేయాలని కమిషనర్‌కు వినతి



బండబావి అంశాన్ని కమిషనర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఓల్డ్ మీర్‌పేట్‌లోని బండబావి అభివృద్ధిపై శుక్రవారం కార్పొరేటర్ ప్రభుదాస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. బండబావి అభివృద్ధితో పాటు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకారం అందజేయాలని కోరారు. అందుకు సంబంధించి గతంలో ఉన్న ప్రతిపాదనలను కమిషనర్‌కు వివరించగా సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

రామంతాపూర్: రామంతాపూర్ ఆర్టీసీ కాలనీ నుంచి కోఠి, సికింద్రాబాద్‌కు నడిచే బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు కోరారు. ఈ మేరకు టీజీఎస్ ఆర్టీసీ ఉప్పల్ డిపో మేనేజర్ హరికీర్తి శ్రీనివాసులును శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... గతంలో ఆ రూట్లలో బస్సులు నడిచేవని కరోనా లాక్‌డౌన్ నుంచి ఆయా బస్సులను పూర్తిగా నిలిపివేశారన్నారు. వెంటనే 115, 18ఆర్ బస్సులను పునరుద్ధరించాలని వినతిపత్రంతో కోరారు. అందుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే బస్సులను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్ ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఆక్రమణలను ఉప్పల్ జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. ఆక్రమణలపై ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. స్పందించిన అధికారులు శుక్రవారం వచ్చిన జేసీబీలతో తొలగించారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా
పటిష్ట చర్యలు

- నిధుల మంజూరు చేయాలని జలమండలి ఎండీకి వినతి
- తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడండి
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత యాదవ్

అల్వాల్/గౌతంనగర్: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నియోజవర్గంలోని కాలనీలు బస్తీలనే తేడా లేకుండా అన్ని డివిజన్లలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. తాగునీటితోపాటు ఇతర అవసరాలకు వినియోగించే నీటికి కూడా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. డ్రైన్ అవుట్ లెట్, స్టార్మ్ వాటర్ డ్రైన్ సమస్యలు పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయా అంశాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఖైరతాబాద్‌లోని ఎండీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆయనను కలిసి ఆయా సమస్యలపై వినతిపత్రాన్ని ఎండీకి అందజేశారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ప్రశ్నాత్మకంగా మారిన గ్రీన్ ల్యాండ్స్ ఎన్‌క్లేవ్, గంగా అవెన్యూ, శ్రీనివాసిక శాన్వి విల్లాస్, కాశీపురం, ఎం.హెచ్.ఆర్ కాలనీ, ఎం.ఈ.ఎస్ కాలనీలలో డ్రైన్ అవుట్‌లెట్, స్టార్మ్ వాటర్ డ్రైన్ సమస్యలు పరిష్కరించాలని ఎండీని కోరామని తెలిపారు.

◆ నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో గడచిన దశాబ్ద కాలంగా మంచినీటి కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్, జయగిరిలక్ష్మీ నరసింహనగర్, న్యూ వెంకటేశ్వరనగర్, బిహారీబస్తీ తదితర ప్రాంతాలలో మహేంద్రాహిల్స్ రిజర్వాయర్ నుంచి రోజు విడిచి రోజు 2 ఎంఎల్ నీటిని సరఫరా చేయాలని కోరినట్లు వివరించారు.

◆ మహేంద్రహిల్స్‌లో 5ఎంఎల్ కెపాసిటీతో నూతన రిజర్వాయర్ నిర్మించాలని సూచించారు. మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌ల ప్రజల అవసరాలను సరిపడా తాగునీటిని సరఫరా చేయాలని కోరామన్నారు.

◆ మల్కాజిగిరి నియోజకవర్గంలోని 9 డివిజన్‌లలో అత్యవసరంగా చేయవలసిన పనులకు రూ. 250 కోట్లు మంజూరు చేయాలని ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు ముఖ్యమంత్రితో సహా సంబంధిత మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో ఆయా పనులు కార్యరూపం దాల్చనున్నామని సమాధానం చెప్పినట్లు ఎమ్మెల్యే మర్రి స్పష్టం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మల్కాజిగిరి ప్రజలకు దాహార్తి తీర్చడానికి కృషి చేయాలని కోరినట్లు వివరించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



క్రిస్మస్ కార్నివాల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, పాస్టర్లు

అల్వాల్: ఏసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికీ ఉండాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెంకటాపురం డివిజన్ అల్వాల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటాపురం లాస్ట్ బస్టాప్ నుంచి భూదేవినగర్ మీదుగా ఇంద్రానగర్ వరకు క్రిస్మస్ కార్నివాల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని.. అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీ డాక్టర్ కె.బాబురావు, అనిల్‌కిషోర్‌గౌడ్, లియోనార్డ్, దినకరన్, ఆనంద్‌కుమార్, నాహమ్, నవీన్, డేవిడ్ సుధాకర్, ఇసాక్ రాజ్, సాల్మన్, మృత్యుంజయ, సోమశేఖర్, సంతోష్, విజయ్, రాంబాబు, ఫ్రాంక్లిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఇందిరానగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులను శుక్రవారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కోట్ల నర్సింహారెడ్డి, ఈవో విజయభారతి శుక్రవారం సభ్యులను సత్కరించారు. అనంతరం పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా ఏటా బోనాల జాతర, అమ్మవార్ల ఆలయాలకు ఇచ్చే నిధులను రెట్టింపు చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పూస సత్తయ్య అన్నమనేని జగదీష్‌కుమార్, గూడురు విజయభాస్కర్, ముత్యాల బాబు, అశోక్, కన్న బోయిన అంబిక, కంది ఆగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



పూల మొక్కలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అన్నారు. కార్పొరేటర్ చొరవతో రామంతాపూర్ ప్రధాన రహదారి నుంచి అంబర్‌పేట వరకు ఉన్న డివైడర్‌ల మధ్యలో పూల మొక్కలను శుక్రవారం ఏర్పాటు చేశారు. పూల మొక్కలను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఆయా మొక్కలు ఏపుగా పెరిగే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆమె సూచించారు. యూబీడీ సర్కిల్ మేనేజర్ నరసింహారావు, బీజేపీ నాయకులు సంజయ్ పటేల్, సుమన్‌రావు, తెల్లోజు ఎల్లాచారి, హనుమంతరావు, శంకర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్కు సుందరీకరణ పనుల పరిశీలన



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, వెంకటేశ్వరనగర్ కాలనీలోని పార్కు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ప్రభుదాస్ శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా డివిజన్‌లోని పార్కుల సుందరీకరణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. త్వరలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతగా భావించి పార్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు ఆరోగ్యవంతమైన జీవనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీపతి, నర్సయ్య, బాబురావు, రాజేశ్వరరావు, వెంకటాచారి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్‌లో సత్తాచాటిన సాయి అనన్య



రన్నరప్ ట్రోఫీ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న సాయి అనన్య

అల్వాల్: జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్‌లో నేరేడ్‌మెట్ డివిజన్‌లోని సైనిక్‌పురికి చెందిన సాయి అనన్య సత్తాచాటింది. ఆల్ ఇండియా టెన్నిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేది వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో అండర్–18 జాతీయస్థాయి టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నీలో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించిన సాయి అనన్య ప్రతిభను కనబరిచి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో హరియాణాకు చెందిన ఆనందిత ఉపాధ్యాయతో తలపడిన సాయి అనన్య 6–3, 6–1తో పరాజయం పొంది రన్నరప్‌గా నిలిచింది. టోర్నమెంట్ డైరెక్టర్ దినేష్ అరోరా, ఆర్గనైజర్ హిమాన్షు మాలిక్‌లు రన్నరప్ ట్రోఫీతోపాటు సర్టిఫికెట్‌ను అమెకు అందజేసి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. శుక్రవారం వంపుగూడ శ్మశానవాటికలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... శ్మశానవాటిక అభివృద్ధికి ఇప్పటికే రూ. 35 లక్షలు వెచ్చించామని, మరో రూ. 27 లక్షలతో పనులు కొనసాగుతున్నాయన్నారు. మొత్తం రూ. 62 లక్షలతో వంపుగూడ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో ఇందులో గ్రీనరీ అభివృద్ధి పనులను సైతం చేపడుతున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సబిత

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలో తాగు నీటి సమస్య, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సబిత అనిల్‌కిషోర్ శుక్రవారం జలమండలి జీఎం సునీల్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. వెస్ట్ వెంకటాపురం శివాలయం వద్ద వాటర్ పైపులైన్ మార్చాలని, కానాజీగూడ ప్రశాంతి ఎన్‌క్లేవ్‌లో యూజీడీ రీమోడలింగ్ పనులు పూర్తి చేయాలని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



మల్లాపూర్: తెలంగాణ సైకిల్ పోలో అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం సాయంత్రం నాచారంలో బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ సైకిల్ పోలో అసోసియేషన్ చైర్మన్ సత్యనారాయణ, చందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కోశాధికారి పాండురంగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం కమిషనర్ రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సూపర్ వైజర్ రోజుకు 50 నుంచి 60 ఇళ్లను తప్పని సరిగా సర్వే చేయాలన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా



డ్రైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ గ్రీన్‌హిల్స్ కాలనీ ఫేస్ 2లో నెలకొన్న స్టామ్ వాటర్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేంద ర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రీన్‌హిల్స్ కాలనీలో స్థానికులతో కలిసి పర్యటించారు. పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైన్ వాటర్ సమస్య ఉందని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాలనీ అధ్యక్షుడు ఎం.డి.అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: నిత్యం వ్యాయామం, యోగా సాధనతో పరిపూర్ణ ఆరోగ్యం సొంతం అవుతుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ సోనియా గాంధీనగర్ ఫేజ్–1లో హిల్ హెల్త్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... హోటల్స్, స్ట్రీట్, జంగ్ ఫుడ్ తరచూ తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఇంటి భోజనంతోపాటు పోషక విలువలు కలిగిన భోజనం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని ఆమె సూచించారు. వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, లింగం నాయక్, కాలనీ నేతలు భిక్షపతి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, డాక్టర్ నిఖిత, సిబ్బంది భవాని, పద్మజ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సామూహిక సీమంతాలు



దివ్యాంగుల పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అల్వాల్: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా జయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్వాల్ సెక్టార్ ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి చాపలు, వాటర్ ఫిల్టర్‌ను విరాళంగా అందచేశారు. అనంతరం అభ్యుదయ శ్రావణ దివ్యాంగుల పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జయ ఫౌండేషన్ ప్రతినిధులు వంపు జార్జీ, జయశీల, చార్లెస్ కళ్యాణ్, గూరటి చారిటబుల్ ట్రస్ట్ ప్రకాష్, అంగన్‌వాడీ టీచర్లు ఉమ, ఉషతిరుమల, ఆశావర్కర్ గంగ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న హరినాథ్‌రెడ్డి

బోడుప్పల్: 7వ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డివిజన్ ఇన్‌చార్జి హరినాథ్‌రెడ్డి శుక్రవారం మేయర్ తోటకూర అజయ్‌యాదవ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల మంజూరైన సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. అలాగే గాయత్రి నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గుడి స్థలం పై నుంచి కరెంట్ వైర్లు వెళ్తున్నందున వాటిని తొలగించాలని వినతి పత్రం అందజేశారు.

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టులు

కుషాయిగూడ: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో శుక్రవారం చర్లపల్లి పోలీసులు ఆటో యూనియన్ల నేతలను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టిన మమ్మల్ని అక్రమంగా నిర్బంధించడం తగదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఆటో డ్రైవర్ల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణంతో ఆటోలు నడవక ఆటో డ్రైవర్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఫైనాన్సియర్ల వేధింపులతో ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు తరచుగా చోటు చేసుకుంటున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 12 వేల రూపాయాలతోపాటు ఇన్సూరెన్స్‌పై సబ్సిడీని అందజేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. అరెస్టయిన వారిలో ఆటో యూనియన్ నాయకులు రామాంజనేయులు, గోపాల్‌నాయక్, రమేష్, శ్రీనివాస్, దేవరాజ్, ప్రవీణ్, అనిల్, యాదగిరి, రాజు, సురేష్, బాలరాజు ఉన్నారు.